



సమస్యల వ్యథ..

గురుకులాలు, హాస్టళ్లలో సౌకర్యాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గురుకులాలు, హాస్టళ్లలోని పరిస్థితులపై 'ఆంధ్రజ్యోతి' శనివారం విజిట్ నిర్వహించింది. సొంత భవనాలు, అద్దెభ వనాల్లో కొనసాగుతున్న గురుకులాలు, హాస్టళ్లలో విద్యార్థులు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. చలికాలం కావడంతో విద్యార్థులు మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. కిటికీలకు డోర్లు లేక ప్లాస్టిక్ కవర్లు కట్టుకుంటున్నారు. డైనింగ్ హాల్‌లు లేక ఆరుబయటే భోజనాలు చేస్తున్నారు. మరు గుదొడ్లు కంపు కొడుతున్నాయి. దుప్పట్లు ఇవ్వక పోవడంతో ఇంటి నుంచే తెచ్చుకుంటున్నారు. ఆంధ్ర జ్యోతి బృందం హాస్టళ్ల సందర్శనకు వెళ్లినప్పుడు కొన్ని చోట్ల ఎవరినీ అనుమతించవద్దని ఆదేశాలు ఉన్నట్లు హాస్టల్ వార్డెన్‌లు, గురుకులాల ప్రిన్సిపాల్‌లు చెప్పారు. జిల్లాలో సంక్షేమం జూనియర్ కళాశాలు 7, మైనార్టీ సంక్షేమ జూనియర్ కళాశాలలు 2, మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ కళాశాలలు 2, కస్తూర్బాగాంధీ జూనియర్ కళాశాలలు 4, తెలంగాణ గురుకుల జూనియర్ కళాశాల 1, కేజీబీవీ పాఠశా లలు 13, గురుకుల పాఠశాలలు 21, ఎస్సీ, ఎస్టీ, బీసీ, హాస్టళ్లు 14 వరకు ఉన్నాయి. గురుకులపాఠశాలల్లో 7 వేల మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. కేజీబీవీల్లో 2800 మంది వరకు చదువుకుంటున్నారు.

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

- గురుకులాలు, హాస్టళ్లలో విద్యార్థుల అవస్థలు
- పనిచేయని హీటర్లు.. చన్నీళ్ల స్నానాలు
- అస్తవ్యస్తంగా మరుగుదొడ్లు, స్నానాల గదులు
- నిర్లక్ష్యానికి నిదర్శనం సంక్షేమం

కిటికీలు లేక ఇబ్బందులు

కోనరావుపేట : కోనరావుపేట మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో కిటికీలు లేక విద్యార్థులు చలికి ఇబ్బందులు పడుతున్నారు. చన్నీటి స్నానాలు చేస్తున్నారు. ధర్మారం ఎస్సీ హాస్టల్‌లో దుప్పట్లు రాకపోవడంతో ఇంటి నుంచి తెచ్చుకున్నారు. మరిమడ్ల ఏకలవ్య గురుకుల పాఠశాలలో చన్నీటితో స్నానాలు చేస్తున్నారు.



రుద్రంగిలో చిరిగిపోయిన కిటికీల దోమతెరలు

అధ్వానంగా మరుగుదొడ్లు

గంభీరావుపేట : గంభీరావుపేట ఎస్సీ బాలుర వసతి గృహంలో మరుగుదొడ్ల సెప్టిక్ ట్యాంక్‌లు నిండి అధ్వానంగా మారాయి. మరుగుదొడ్లకు తలుపులు లేవు. ఇచ్చిన బెడ్ షీట్‌లు పల్చగా ఉండడంతో ఇంటి నుంచి రగ్గులు తెచ్చుకున్నారు. కిటికీలకు దోమ తెరలు లేవు. ఈ ఏడాదికి సంబంధించి బెడ్ షీట్లు, స్పోర్ట్స్ షూ, స్లిపర్స్ రాలేదు. నర్మాల గురుకుల ఆశ్రమ పాఠశాలలో అడవి పందుల బెడద ఉంది. గంభీరావుపేట కస్తూర్బాలో సరిపడా మూత్రశాలలు లేవు. దమ్మన్నపేట మోడల్ స్కూల్‌లో దుప్పట్ల సమస్య ఉంది.

నేలపై నిద్రిస్తున్న విద్యార్థులు

ఇల్లంతకుంట: ఇల్లంతకుంటలోని గురుకుల, కస్తూర్బాలో విద్యార్థినులు నేలపై నిద్రిస్తున్నారు. మండలంలోని బాలికల గురుకుల పాఠశాలలో స్నానాలకు కట్టెల పొయ్యిమీద నీటిని వేడి చేస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబరులో గాలిపెల్లి వసతి గృహంలో దరవాత్ రోహిత్ అనే విద్యార్థిని పాము కాటు వేసింది. రాష్ట్ర విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఇరువై రోజుల క్రితం హాస్టళ్లను పరిశీలించిన అనంతరం వసతులు మెరుగయ్యాయి.



గాలిపెల్లి గ్రామంలోని బీసీ బాలుర హాస్టల్ ప్రహరీ పక్కనే పత్తిచేను

త్వరలో స్వశక్తి చీరల ఆర్డర్లు

- ఆత్మహత్యలు వద్దు
- సమస్యలు ఉంటే సంప్రదించండి
- కార్మికులకు భరోసా నింపేందుకు కౌన్సెలింగ్
- చేనేత జౌళి శాఖ ఏడీ సాగర్



ఇంటర్వ్యూ

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవద్దని, త్వరలోనే స్వశక్తి చీరల ఆర్డర్లు రానున్నాయని జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీ సాగర్ తెలిపారు. సిరిసిల్ల నేత కార్మికులకు ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఇప్పటికే ఆర్వీఎం ఉత్పత్తి ఆర్డర్లు ఇచ్చామని అన్నారు. స్వశక్తి సంఘాల మహిళలకు రెండు చీరల చొప్పున అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, త్వరలోనే ఆ ఆర్డర్లు రాబోతున్నాయని అన్నారు. సమ స్యలు ఉంటే నేత కార్మికులు జౌళి శాఖ కార్యాలయానికి రావాలని కోరారు. శనివారం ఆయన 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో పలు అంశాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి : సిరిసిల్ల నేత కార్మికుల ఉపాధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఏడీ సాగర్ : నేత కార్మికులకు ఉపాధి అందించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. త్వరలోనే రాష్ట్రంలోని 63 లక్షల మంది స్వశక్తి సంఘాల మహిళలకు ఇందిరాశక్తి ద్వారా రెండు చీరల చొప్పున ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకు డిజైన్లు ఖరారు చేసింది. త్వరలోనే ఆర్డర్లు రాబోతున్నాయి. సిరిసిల్ల మరమగ్గాలపై కోటి 30 లక్షల చీరల ఉత్పత్తి జరగనుంది.

ఆంధ్రజ్యోతి: ఆత్మహత్యల నివారణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

ఏడీ సాగర్ : సిరిసిల్ల పవర్‌లూం కార్మికుల్లో భరోసాను నింపే దిశగా ఆత్మహత్యల నివారణకు మైండ్ కేర్ కౌన్సెలింగ్ సెంటర్ ద్వారా కౌన్సెలింగ్ అందిస్తున్నాం. కార్మికులు పనిలేక ఇబ్బంది పడవద్దు. పని, ఇతర సమస్యలు ఉంటే చేనేత జౌళి శాఖ కేంద్రాన్ని సంప్రదించాలి.

ఆంధ్రజ్యోతి: ఇప్పటి వరకు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఏం ఆర్డర్లు ఇచ్చారు?

ఏడీ సాగర్ : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఇప్పటి వరకు ఆర్వీఎం ఆర్డర్లు ఇచ్చాం. జనవరి నుంచి రూ.107.55 కోట్ల విలువైన 1.61 కోట్ల మీటర్ల బట్ట ఉత్పత్తి ఆర్డర్లు అందించాం.

ఆంధ్రజ్యోతి : వస్త్ర పరిశ్రమకు బకాయిలు ఎన్ని చెల్లించారు

ఏడీ సాగర్ : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు సంబంధించి బతుకమ్మ చీరలు, యారన్ సబ్సిడీ, ఇతర పెండింగ్ బకాయిలు రూ.222.39 కోట్లు విడుదల చేశాం. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి పెండింగ్ బకాయిలు రూ. 157.46 కోట్లు విడుదల చేశారు. యారన్ సబ్సిడీకి సంబంధించి రూ.6.32 కోట్లు చెల్లించారు. నేతన్న చేయూత పథకంలో 4963 మంది మరమగ్గాల, అనుబంధ కార్మికులకు ప్రభుత్వ వాటా కింద రూ.6.51 కోట్లు చెల్లించాం.

ఆంధ్రజ్యోతి : యారన్ డిపో ద్వారా నూలు ఎంత అందించారు?

ఏడీ సాగర్ : వేములవాడ కేంద్రంగా ప్రభుత్వం రూ.50 కోట్లతో యారన్ డిపో ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు రూ.1.56 కోట్ల విలువైన యారన్‌ను సంఘాలకు కేటాయించాం.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా రజిత

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ రజిత శనివారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ను మర్యాద పూర్వకంగా కలి శారు. పూల మొక్కను అంది ంచగా కలెక్టర్ అభినం దన లు తెలిపారు. ఇంతకు ము ందు పనిచేసిన వసంతరావు స్థానంలో బాధ్యతలు స్వీకరించారు.



కలెక్టర్‌కు మొక్కను అందిస్తున్న డాక్టర్ రజిత

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



ఎగ్జిబిట్స్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో

- శ్రీనివాస రామానుజానికి ఘన నివాళి
- విద్యార్థులకు పోటీలు

8

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



విజేతగా నిలిచిన రాజన్న సిరిసిల్ల జిల్లా పురుషుల జట్టు

- విజేతలుగా రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లా జట్లు

7

31లోగా ధాన్యం అందజేయాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

గంభీరావుపేట డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): యాసంగి 2022-23 సంబంధించి వేలం వేసిన ధాన్యాన్ని ఈనెల 31లోగా అందజేయాలని పలు రైస్ మిల్ యజమానులను అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. యాసంగి 2022-23 గంభీరావుపేట మండలంలోని వేంకటేశ్వర ఇండస్ట్రీస్, లింగన్నపేట,లక్ష్మీనారాయణ ఇండస్ట్రీస్, లింగన్నపేట వాయు పుత్ర రైస్ మిల్, కొత్తపల్లి మిల్లులను శనివారం తనిఖీ చేశారు. అంది ంచని పక్షంలో చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఆదేశాలు జారీ చేశారు. జిల్లా పౌర సరఫరాల అధికారి వసంతలక్ష్మి, సివిల్‌సప్లయీస్ డిప్యూటీ తహసీల్దార్ నవీన్ కుమార్, తహసీల్దార్ భూపతి ఉన్నారు.

నేరాల నియంత్రణకు విస్తృత పెట్రోలింగ్

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు పెట్రోలింగ్ విస్తృతం చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయా పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌హెచ్‌వోలతో నేరాల నియంత్రణపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. నేరాలు జరుగుతున్న తీరు, ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తిం చాలని, ఆయా ప్రాంతాల్లో ప్రతీ రోజు సాయంత్రం పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. విచారణలో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. పోక్సో , ఎస్సీ, ఎస్టీ గ్రైవ్ కేసుల్లో త్వరితగతిన విచారణ పూర్తి చేయాల న్నారు. దొంగతనాలపై ప్రతీ రోజు నిఘా పెట్టాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకోవాలని, సమాచార వ్యవస్థను పటిష్టం చేయాలని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. అసా ంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచా లన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐలు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస, వెంకటేశ్వర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్, చిత్రంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

శ్రీనివాస్ మృతికి మరమగ్గాల వృత్తికి సంబంధం లేదు

- జౌళి శాఖ ఏడీ సాగర్

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన నక్క శ్రీనివాస్ ఆత్మహత్యకు వస్త్ర పరిశ్రమతో సంబంధం లేదని చేనేత జౌళి శాఖ ఏడీ సాగర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీవైనగర్‌కు చెందిన శ్రీనివాస్ పద్మశాలీ కులానికే చెందిన వాడని 2020 వరకు మరమగ్గాల కార్మికుడిగా పని చేసిన సమయంలో ప్రమాదవశాత్తు కుడిచెయ్యి విరిగిపోయిందని తెలిపారు. అప్పటి నుంచి మరమగ్గాల పని మానేసి ఆటో డ్రైవర్‌గా, సిమ్ కార్డుల విక్రేతగా, పలు వైన్స్‌లు, పెట్రోల్ బంక్‌ల్లో పనిచేసే వాడని తన విచారణలో తేలిందన్నారు. కుడిచెయ్యి పూర్తిగా పనిచేయకపోవడంతో మనస్తాపానికి గురై ఉరేసుకున్నాడని తెలిపారు.

ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

వేములవాడ/వేములవాడ టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామంటూ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ వేములవాడ నంది కమాన్ నుంచి పాదయాత్రగా వేములవాడకు వచ్చిన సమగ్ర శిక్ష ఉద్యోగులు మూలవాగు బ్రిడ్జి సమీ పంలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళుల ర్పించారు. అనంతరం రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఎదుట మాట్లాడారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని హనుమకొండ సభ ద్వారా హామీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ఏడాది గడిచినా పట్టించుకోవడం లేదని వాపోయారు. 12వ రోజు నిరసన కార్యక్రమాల్లో భాగంగా వేములవాడ నందికమాన్ నుంచి రాజన్న ఆలయం వరకు పాదయాత్ర చేసి నిరసన వ్యక్తం చేశామన్నారు. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డికి సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. జాక్ కమిటీ జిల్లా అధ్యక్షులు ఇప్పపూల దేవయ్య, ఉపాధ్యక్షులు నరేందర్, శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్ : విద్యాశాఖలో సమగ్ర శిక్ష విభాగంలో కాంట్రాక్టు పద్ధతిన 14 విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇప్పపూల దేవేందర్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ అధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 12వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్ష శిబిరంలో పాల్గొన్న ఉద్యోగులు వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవాలయం వరకు పాదయాత్ర చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దేవేందర్ మాట్లాడుతూ ఉద్యోగులందరికీ మినిమమ్ టైమ్ స్కేల్ ఇవ్వాలన్నారు. దీక్షల్లో బుర్ర జలేందర్, జయలక్ష్మీ, నీరజ, నరేందర్, శ్రీనివాస్, దేవరాజ్, ఎండి సలీం, వెంకటేష్, శ్యామల తదితరులుపాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

కోరుట్ల రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కోరుట్ల మున్సిపల్ పరిధిలో, కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలో శనివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన శనిగారపు మల్లయ్య (80) అనే వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని బస్టాండ్ సమీపంలో మల్లయ్య ద్విచక్ర వాహనంపై రోడ్డు క్రాస్ చేస్తున్న సమయంలో వేములవాడకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టగా మల్లయ్యకు తీవ్రగాయాలయ్యాయి. మల్లయ్యను స్థానికులు చికిత్స నిమిత్తం కోరుట్ల ఆసుపత్రికి తరలిస్తుండగా మల్లయ్య మార్గమధ్యంలో మృతి చెందాడు. మల్లయ్య కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వీణవంక(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేతిగల్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బండారి చేరాలు(55) అనే వ్యక్తి మృతి చెందాడు. చేరాలు తన ద్విచక్ర వాహనంపై బేతిగల్ వైపు వస్తున్న క్రమంలో ఓ కారు అతివేగంగా అజాగ్రత్తగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో బండారి చేరాలుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య బండారి లింగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ధర్మపురి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన మామిడి రాజన్న (45) అనే వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న పెద్ద కొడుకు గణేశ్ మూడు సంవత్సరాల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటి నుంచి రాజన్న మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురై కొన్ని రోజుల క్రితం క్రిమిసంహారక మందు తాగాడు. చికిత్స కోసం కరీంనగర్ తరలించగా శనివారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడు రాజన్న కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

స్ఫూర్తి



పవిత్ర తయారు చేసిన హెయిర్ ఆయిల్, షాంపూ, సున్నిపిండి, హెన్నా

తాను తయారు చేసిన హెయిర్ ఆయిల్, షాంపూ, సున్నిపిండి, హెన్నాను చూపుతున్న పవిత్ర

ఆదాయ వనరుగా సహజ ఉత్పత్తులు

కొద్దిపాటి శిక్షణతో సహజ ఉత్పత్తుల తయారీని ఆదాయ వనరుగా మార్చుకున్నది మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన పల్లెర్ల పవిత్ర. ప్రకృతిలో దొరికే పువ్వులు, ఆకులు, వేర్లతో హెయిల్ ఆయిల్, షాంపూ, సున్నిపిండి, హెన్నా తయారుచేస్తోంది. మొదట్లో వ్యాపారంలో ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొన్నా ధైర్యంగా వాటిని అధిగమించింది. ప్రస్తుతం తన ఉత్పత్తుల అమ్మకాల ద్వారా నెలకు పదివేల రూపాయల వరకు సంపాదిస్తోంది.

- కాల్వశ్రీరాంపూర్, ఆంధ్రజ్యోతి

- పువ్వులు, ఆకులు, వేర్లతో తయారీ
- డీఆర్‌డీఏ, ఐకేపీ సహకారంతో విక్రయాలు

స్వశక్తి సంఘంలోని పలువురు సభ్యులకు నాలుగేళ్ల క్రితం డీఆర్‌డీఏ, ఐకేపీ అధికారులు హెర్బల్ ఉత్పత్తుల తయారీపై హైదరా బాద్‌లో శిక్షణ ఇప్పించారు. ఎలాంటి రసాయనాలు వాడకుండా ప్రకృతిలో దొరికే పవ్వులు, ఆకులు, వేర్లతో హెయిల్ ఆయిల్, షాంపూ, సున్నిపిండి, హెన్నా తయారీని నేర్పిం చారు. అలా శిక్షణ పొందిన స్వశక్తి సంఘ సభ్యురాలైన పల్లెర్ల పవిత్ర ఇంటివద్దనే వాటిని తయారు చేసి విక్రయిస్తూ ఆదాయం పొందుతోంది. 2019లో డీఆర్డీఏ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పలువురు మహిళలు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ఉత్పత్తులు తయారీలో వారం రోజులు శిక్షణ పొందారు. ఆరుగురు శిక్షణ పొందగా ఐదుగురు వివిధ కారణాలతో విరమించుకోగా, పల్లెర్ల పవిత్ర మాత్రం పట్టుదలతో



సహజ ఉత్పత్తులను తయారు చేస్తున్న పవిత్ర

కష్టనష్టాలకు ఓర్చి హెర్బల్ ఉత్పత్తులను తయారుచేసి కరీంనగర్, పెద్దపల్లి, గోదావరిఖని, చొప్పదండి తదితర ప్రాంతాల్లోని దుకాణాల ద్వారా అమ్ముతోంది. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో శిక్షణ పొందిన తర్వాత స్వశక్తి గ్రూపులో రుణం తీసుకొని ఉత్పత్తుల తయారీ కొనసాగిస్తోంది.

● నాలుగేళ్లుగా తయారీ..

ప్రకృతిలో దొరికే తులసి, మందార, కుంకుడుకాయ, అలోవేరా, వేపాకు, మర్రిఊడలు, గులాబీ, గోరింటా, గలిజేరు, తుంగగడ్డలు తదితర వాటిని తయారీకి వినియోగిస్తోంది. 2020 మార్చి 8 అంతర్జాతీయ మహిళ దినోత్సవం రోజు అప్పటి కలెక్టర్ దేవసేన పవిత్ర తయారుచేసిన సున్నిపిండి, హెయిర్ ఆయిల్, షాంపూ, హెన్నాను డీఆర్డీఏ ఆధ్వర్యంలో ప్రారంభించారు. అనంతర పవిత్రను ప్రత్యేకంగా అభినందించారు. కలెక్టర్‌తో పాటు డీఆర్డీఏ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు, పలువురు మహిళలు హెర్బల్ ఉత్పత్తులను కొనుగోలు చేశారని పవిత్ర తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో దొరికే పూలు, చెట్లు, ఆకులు, వేర్లతో తయారు చేసే ఈ హెర్బల్ ఉత్పత్తులు వాడడం వలన ఎలాంటి హాని ఉండన్నారు. ఈ నాలుగు ఉత్పత్తులతో నెలకు పదివేల వరకు ఆదాయం వస్తోందని పవిత్ర పేర్కొన్నారు. పెద్దపల్లి కలెక్టరేట్‌లో గణతంత్ర, స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా డీఆర్డీఏ, ఐకేపీ



పవిత్ర తయారుచేసిన ఉత్పత్తులను ప్రారంభిస్తున్న కలెక్టర్ దేవసేన, ఇతర అధికారులు(ఫైల్)

ఆధ్వర్యంలో తాను తయారుచేసిన ఉత్పత్తుల స్టాల్‌ను నాలుగేళ్లుగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డీఆర్డీఏ, ఐకేపీ సహకారంతో హైదరాబాద్‌లోని శిల్పారామంలో కూడా స్టాల్‌ను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు పవిత్ర తెలిపారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరెడ్డిపేట గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీ దొంగిలించి అందులో ఉన్న సుమారు 5 వేల రుపాయలు ఎత్తుకెళ్లినట్లు గౌడ సంఘం నాయకులు బండారి తిరుపతిగౌడ్, శ్రీరాముల శంకరయ్యగౌడ్ పేర్కొన్నారు. ఆలయంలో ఉన్న ఆరు తులాల వెండి, కొంతమేర బంగారం చోరీకి గురైందని పెద్దపల్లి పోలీసులకు సమాచారం అందించినట్లు వారు తెలిపారు.

● ఓదెలలో..

ఓదెల(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రాపెల్లి రాజయ్య అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బీరువాలో ఉన్న రూ.20 వేలు నగదు, దాదాపు నాలుగు తులాల బంగారం చోరీకి పాల్పడినట్లు తెలిపారు. పొత్కపల్లి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు రాజయ్య పేర్కొన్నారు.

గుప్త నిధుల పేరిట మోసం

● మహిళ వద్ద రెండేళ్లలో రూ.45లక్షలు వసూలు

మల్యాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గుప్త నిధుల కోసం అత్యాశకు వెళ్లిన ఓ మహిళ మోసానికి గురై లక్షలాది రూపాయాలు పోగొట్టుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కొండగట్టుకు చెందిన ఓ మహిళ వద్దకు వచ్చిన ఓ సూర్యాపేట జిల్లాకు చెందిన లింగానాయక్ వాసిగా పరిచయం చేసుకున్నాడు. సదరు వ్యక్తి ఇక్కడి చుట్టుపక్కల ప్రాంతంలో గుప్తనిధులు ఉన్నాయని మహిళను నమ్మించాడు. వాటిని పొందాలంటే పూజలు చేయించుకుంటే బంగారు బిళ్లలు తీసి ఇస్తానని చెప్పి రెండేళ్ల కాలంలో పలుమార్లు 45 లక్షల రూపాయల మేర వసూలు చేశాడు. ఇందులో భాగంగా కొండగట్టు సమీపంలోని ఓ చోట గుంత తవ్వి అందులో నుంచి కుండ తీసి దూరం నుంచే బంగారు బిళ్లలు చూపించాడు. వాటికి పూజలు చేసిన తరువాత ఇస్తా అని చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోయేసరికి మోసపోయినట్లు గుర్తించిన మహిళ 15 రోజుల క్రితం మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా నిందితుడు లింగానాయక్ పరారిలో ఉన్నట్లు ఎస్సై వివరించారు.

పార్ట్‌టైమ్ జాబ్‌లు, ట్రేడింగ్ పేరుతో మోసం

- మంచిర్యాలలో గృహిణి నుంచి రూ.31.6లక్షలు కాజేసిన సైబర్ నేరస్థులు - కమీషన్లకు అకౌంట్లు అద్దెకు ఇచ్చిన వ్యక్తి అరెస్ట్

కోల్‌సిటీ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ పార్ట్‌టైమ్ జాబ్‌లు, ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో మంచిర్యాలకు చెందిన ఒక గృహిణిని సైబర్‌నేరగాళ్లు మోసగించి రూ.31.6లక్షలు కాజేశారు. ఈ ఏడాది అక్టోబరు 11న బాధితురాలు రామగుండం సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా డీఎస్పీ వెంకటరమణ ఆధ్వర్యంలో విచారణ జరిపిన పోలీసులు నిందితుడు మహ్మద్ ఆవాజ్(21)ను శనివారం అరెస్టు చేశారు. మంచిర్యాలకు చెందిన ఒక గృహిణిని ఆన్‌లైన్ ట్రేడింగ్, పార్ట్‌టైమ్ జాబ్‌ల పేర సైబర్ నేరస్థులు నమ్మించారు. ట్రేడింగ్‌లో లక్షలు వస్తాయని చెప్పడంతో సైబర్ నేరస్థులు చెప్పిన అకౌంట్‌లో డబ్బులు వేసుకుంటూ వెళ్లింది. అలా రూ.31,60,900 అకౌంట్‌లో వేసింది. తరువాత మోసపోయినట్టు గుర్తించి అక్టోబరు 21న రామగుండం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన సైబర్ క్రైమ్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో, డీఎస్పీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, సిబ్బంది కుమార్ ఆధ్వర్యంలో విచారణ జరిపారు. డబ్బులు డ్రా అయిన అకౌంట్ ఆధారంగా విచారణ జరుపగా హైదరాబాద్ మలక్‌పేటలో నిందితుడు మహ్మద్ ఆవాజ్(21)ని పట్టుకున్నారు. అతడు ఏసీ టెక్నీషియన్‌గా, ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. తాను కేవలం అకౌంట్లు తన పేర తెరిచి ఇలియాజ్ అనే వ్యక్తికి ఇస్తానని, వారు సైబర్ నేరానికి పాల్పడి తన అకౌంట్‌లో డబ్బులు వేస్తారని, అలా తన అకౌంట్‌లో డబ్బులు పడినందుకు రూ.300 కమీషన్ ఇస్తారని తెలిపారు. తాను అలా మూడు అకౌంట్లు ఓపెన్ చేసి సైబర్ నేరస్థులకు ఇచ్చినట్టు విచారణలో తెలిపాడని, అతడిని అరెస్టుచేసినట్టు డీఎస్పీ తెలిపారు.



సైబర్ మోసం..

రూ. 9.80లక్షలు మాయం

గంగాధర(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసంతో 9.80 లక్షల రూపాయలు పోగొట్టుకున్న ఘటన గంగాధరలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడి తెలిపిన వివరాల ప్రకారం.. కొడిమ్యాల మండలానికి చెందిన ఓ వ్యక్తికి గంగాధర మండలం మధురానగర్ యూనియన్ బ్యాంకులో ఖాతా ఉంది. బ్యాంకు ఖాతాలో 9.83లక్షలు ఉండగా ఏటీఎంతో అవసరమున్నప్పుడు డబ్బులు డ్రా చేసుకుంటున్నారు. ఏటీఎం కార్డు పోవడంతో కొత్తది తీసుకునేందుకు ఈ నెల 5న అతను బ్యాంకుకు వెళ్లాడు. అక్కడ సిబ్బంది బ్యాంకు టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేయమని తెలిపారు. అయితే బాధితుడు టోల్ ఫ్రీ నంబర్ తప్పుగా కొట్టడంతో ఎదుటి వ్యక్తి హిందీలో మాట్లాడి మరుసటి రోజున వోటీపీ వస్తుందని తెలిపారు. తిరిగి 6న అదే నంబర్ నుంచి ఫోన్ కాల్ చేసి వోటీపీ తెలుపమని చెప్పగానే బాధితుడు తెలిపాడు. ఇలా మూడుసార్లు వోటీపీ పంపి నంబర్ తెలుమని అనగానే బాధితుడు చెప్పగా ఖాతా నుంచి విడతల వారీగా రూ. 9.80 లక్షలు కొల్లగొట్టారు. ఈ నెల 10న బ్యాంకు ఖాతా బుక్కుతో డబ్బులు తీసుకుందామని వెళ్లి పరిశీలించగా ఖాతాలో డబ్బులు లేవని బ్యాంకు సిబ్బంది తెలిపారు. లక్షల రూపాయలున్న ఖాతాలో డబ్బులు ఎలా మాయమయ్యాయని బాధితుడు ఆందోళన చెందాడు. సిబ్బంది పరిశీలించి ట్రాన్స్‌ఫర్ అయిన ఖాతా కనిపించకపోవడంతో బాధితుడి సెల్ ను పరిశీలించారు. సెల్‌కు వచ్చిన వోటీపీ చెప్పానని తెలపడంతో సైబర్ మోసం జరిగినట్లు తెలిసింది. దీనిపై కొడిమ్యాల పోలీసులకు ఫిర్యాదు చేయగా జగిత్యాల సైబర్‌క్రైంకు ఫిర్యాదు చేయాలని సూచించారు. డబ్బులు మాయమై నాలుగు రోజులు గడిచినందున రికవరీ కష్టమని పోలీసులు తెలుపుతున్నారు. దీనిపై సంబంధిత బ్యాంకు మేనేజర్‌ను వివరణ కోరగా బాధితుడు ఏటీఎం పోయిందని రాగా టోల్‌ఫ్రీకి కాల్‌చేయమనగా ఒక నంబర్ తప్పుగా కొట్టాడని, అది సైబర్ నేరగాళ్లకు వెళ్లి వోటీపీ చెప్పగానే పలుమార్లు ఖాతా నుంచి డబ్బులు డ్రా అయినట్లు తెలిపారు. డ్రా చేస్తే దొరుకుతా మని సైబర్ నేరగాళ్లు వస్తువులను కొన్నట్లు తెలుస్తోందని తెలిపారు. బ్యాంకు పేరున వోటీపీ చెప్పమని ఎవరూ ఫోన్‌చేయరని, ఎవరైనా వోటీపీ చెప్పమని ఫోన్‌చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని బ్యాంకు మేనేజర్ సూచించారు.

అదుపు తప్పిన గ్రానైట్ లారీ

- ట్రాన్స్‌ఫార్మర్‌కు ఢీ
- నిలిచిన విద్యుత్ సరఫరా



కిందపడిన గ్రానైట్ రాయి, తెగిన తీగలు

కొడిమ్యాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెప్యాల గ్రామ డబుల్ బెడ్ రూం ఇళ్ల సమీపంలో వేములవాడ-జగిత్యాల ప్రధాన రహదారిపై శనివారం మధ్యాహ్నం గ్రానైట్ రాయిని తరలిస్తున్న లారీ అదుపు తప్పి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. నల్లగొండ వైపు నుంచి గ్రానైట్ రాయిని తరలిస్తున్న లారీ ఇంజన్ ట్రాలీ లింక్ ఊడిపోయి అదుపు తప్పింది. దీంతో ఇంజన్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. విద్యుత్ స్తంభాలు విరిగిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సంఘటన స్థలాన్ని కొడిమ్యాల తహసీల్దార్ రమేష్, ట్రాన్స్‌కో ఏడీఈ ఆర్ మహేందర్, కొడిమ్యాల ఏఈ రఘునాథన్, పోలీసులు పరిశీలించారు. 100కేవీ, 15 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు, మూడు విద్యుత్ పోల్లు దెబ్బతిన్నాయ్యారు. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

యువకుడి హత్య కేసులో నిందితుడి అరెస్ట్

- వివాహేతర సంబంధమే కారణం - వివరాలు వెల్లడించిన వేములవాడ ఏఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

వేములవాడ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తన భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడన్న ఆగ్రహంతోనే నూనె మనోహర్ అనే వ్యక్తి రషీద్ అనే యువకుడిని హతమార్చినట్లు వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి తెలిపారు. ఈ నెల 18వ తేదీన వేములవాడ పట్టణంలో రషీద్ అనే యువకుడిని వేటాడి వెంటాడి కత్తితో పొడిచి దారుణంగా హతమార్చిన ఘటనకు సంబంధించిన వివరాలను ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి శనివారం రాత్రి వేములవాడ రూరల్ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వేముల వాడ పట్టణంలోని సాయినగర్ ప్రాంతంలో నివాసం ఉండే నూనె మనోహర్ అనే వ్యక్తి జీవనోపాధి కోసం కొంతకాలంగా దుబాయిలో ఉంటున్నాడు. ఈ క్రమంలో మనోహర్ భార్యతో అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న మహ మ్మద్ రషీద్(35) అనే యువకుడు వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం మనోహర్‌కు తెలిసింది. వివాహేతర సంబంధం విషయంలో గతంలో భార్యను మందలించగా ఇరువురి మధ్య గొడవ జరిగింది. భార్య మరో ఇంట్లో నివాసం ఉంటూ వివాహేతర సంబంధాన్ని యథావిధిగా కొనసాగిస్తుండడంతో మనోహర్ తీవ్రఆగ్రహానికి లోనయ్యాడు. ఈ క్రమంలో మనోహర్ 45 రోజుల క్రితం దుబాయ్ నుంచి వేములవాడకు వచ్చాడు. భార్య వ్యవహార శైలితో ఎలాగైనా రషీద్ అడ్డు తొలగించుకోవాలని భావించాడు. ఈనెల 18వ తేదీన తెల్లవారుజామున అర్బన్ కాలనీ ప్రాంతంలో ఇంట్లో నుంచి బయటకు వచ్చిన రషీద్‌పై కత్తితో పొడిచి చంపాడు. హత్యానంతరం పరారీలో ఉన్న నిందితుడు మనోహర్‌ను శనివారం మధ్యాహ్నం మల్లారం రోడ్డు ప్రాంతంలో అరెస్ట్ చేసి, హత్యకు ఉపయోగించిన కత్తితో పాటు నిందితుడి పాస్‌పోర్ట్, ద్విచక్ర వాహనం, సెల్‌ఫోను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ వెల్లడించారు. విలేకరుల సమావేశంలో వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్, రూరల్ సీఐ శ్రీనివాస్, రూరల్ ఎస్సై మారుతి, పట్టణ ఎస్సై రమేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శం

విత్తనం వేస్తే అవార్డుల పంటే

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆయన విత్తనం వేస్తూ అవార్డుల పంట పండిస్తున్నాడు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అవలంబిస్తూ.. వేసిన రకాలు వేయకుండా నూతనంగా వచ్చే వంగడాలను డ్రమ్ సీడర్ ద్వారా వరి పంటను పండిస్తూ.. రాష్ట్రంలోని పలువురు రైతులకు మెళకువలను నేర్పించడంతో పాటు అవగాహన కల్పిస్తున్నాడు పెద్దపల్లి జిల్లా పెద్దపల్లి మండలంలోని కాసులపల్లి గ్రామానికి చెందిన రైతు ఎర్రం మల్లారెడ్డి. అధిక దిగుబడి వచ్చే వరి విత్తనాలను తయారు చేసి జిల్లాతో పాటు పలు రాష్ట్రాల రైతులకు ఎగుమతి చేస్తున్నాడు. హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం డైమండ్ జూబ్లీ వేడుకల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా ఉత్తమ రైతు అవార్డు అందుకున్న సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

● డ్రమ్ సీడర్ పద్ధతితో సాగు చేస్తూ..

ఎర్రం మల్లారెడ్డి 2012 నుంచి తనకున్న 12 ఎకరాల్లో డ్రమ్ సీడర్ పద్ధతితో వరిపంటను సాగు చేస్తున్నారు. తనకున్న భూమిలో ఇప్పటివరకు వేసిన రకాలు వేయకుండా నూతనంగా వచ్చే వంగడాలను డ్రమ్ సీడర్ ద్వారా సాగు చేస్తూ ఆర్థిక నష్టాలకు గురయ్యే రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. అలాగే పలు జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన రైతులకు కూడా డ్రమ్ సీడర్ ద్వారా పంట దిగుబడి వరి పంటలోని మెళకువలలో సలహాలిస్తూ రైతులకు అవగాహన

- డ్రమ్‌సీడర్ ద్వారా వరి సాగు
- పలు జిల్లాల రైతులకు సూచనలు ఇస్తున్న మల్లారెడ్డి
- ఉత్తమ రైతుగా అవార్డులు, సత్కారాలు

కల్పిస్తున్నారు. ఇప్పటివరకు వేసిన పంటల రకాల్లో అధిక దిగుబడి వచ్చే వరి విత్తనాలను తయారు చేసి ప్యాకింగ్‌తో జిల్లాతో పాటు పలు రాష్ట్రాల రైతులకు ఎగుమతి చేస్తున్నారు. కొంతమంది రైతులు ఇదేం పద్ధతి అంటూ ఆశ్చర్యానికి గురైనా మల్లారెడ్డి మాత్రం డ్రమ్ సీడర్ పద్ధతి ద్వారా వరిపంటను సాగు చేసి ఔరా అనిపించారు. మల్లారెడ్డిని చూసిన రైతులు కొందరు కూలీల కొరతను నివారించేందుకు డ్రమ్ సీడర్ పద్ధతిని అవలంబిస్తూ పంటలను సాగు చేస్తున్నారు.

● ఇతర రాష్ట్రాలకు నూతన వంగడాలు

మల్లారెడ్డి తాను డ్రమ్ సీడర్ ద్వారా నూతన వంగడాలను సాగు చేస్తూ అందులో చీడపీడలను తట్టుకునే విత్తనాలను ఎంపిక చేసి వాటిని రైతులకు అందిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు కర్నాటక, ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడుతో పాటు పలు రాష్ట్రాల రైతులకు నూతన వంగడాలను అందిస్తూ రైతులు అధిక దిగుబడి పొందేందుకు ప్రోత్సహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర విశ్వ విద్యాలయాల పరిధిలోని ఆరు పరిశోధన కేంద్రాల నుంచి వివిధ రకాలైనా వరి విత్తనాలు తీసుకోచ్చి సాగుచేసి అభివృద్ధి చేస్తున్నారు. వరి వంగడాలతో పాటు కూరగాయల సాగుపై ప్రత్యేక దృష్టి సారించి అధిక దిగుబడిపై శ్రద్ధ వహించి పలువురికి సూచిస్తున్నారు.



డ్రమ్ సీడర్ ద్వారా విత్తనాలు వేస్తున్న రైతు మల్లారెడ్డి

● అన్నదాతలకు అండగా..

పెద్దపల్లి జిల్లా ఫార్మర్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ చైర్మన్‌గా మల్లారెడ్డి బాధ్యతలు తీసుకోన్ని అన్నదాతలకు అండగా నిలుస్తున్నారు. ఆర్గనైజేషన్‌లో సుమారు 300 మంది రైతులను భాగస్వాములను చేసి, అధిక దిగుబడి వచ్చే కురగాయల విత్తనాలు, వరి వంగడాలను రాయితీపై అన్నదాతలకు అందజేస్తున్నారు. వీటితో పాటు పంటలకు అందించే ఎరువులను అందించనున్నట్లు మల్లారెడ్డి తెలిపారు.



మల్లారెడ్డి ఇంట్లో అవార్డులు



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న ఎర్రం మల్లారెడ్డి (ఫైల్)

● అవార్డులు.. సత్కారాలు

డ్రమ్ సీడర్ ద్వారా మల్లారెడ్డి నూతన వరి వంగడాలను సాగు చేస్తుండటంతో పంట పొలాలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి నూతన వంగడాలను పండించడంతో పాటు సరికొత్త పద్ధతులను పాటిస్తూ అధిక దిగుబడులు వచ్చే వంగడాలను రైతులకు అందిస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి పలు అవార్డులు, సత్కారాలు అందించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం, హైదరబాద్‌లో డైమండ్ జూబ్లి వేడుకల్లో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ఒక్కరికి ఉత్తమ రైతు అవార్డు అందించగా పెద్దపల్లి జిల్లా కాసులపల్లి గ్రామానికి చెందిన ఎర్రం మల్లారెడ్డికి అవకాశం దక్కింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.



జగిత్యాల లో తీసుకున్న అవార్డులతో మల్లారెడ్డి దంపతులు

రైతులు ఆనందంగా ఉండేందుకే

- ఎర్రం మల్లారెడ్డి, ఉత్తమ రైతు అవార్డు గ్రహీత, కాసులపల్లి



రైతులు సాగు చేస్తున్న పంటలపై అవగాహన లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. రాష్ట్రంలోని పరిశోధన కేంద్రాల నుంచి ప్రతీ ఏటా 10 రకాల వంగడాలను డ్రమ్ సీడర్ ద్వారా సాగు చేసి నష్టం వాటిల్లని విత్తనాన్ని ఎంపిక చేస్తున్నాను. వీటిని సాగు చేయడం ద్వారా చీడ పీడలను తట్టుకోవడంతో పాటు పెట్టుబడి కూడా తగ్గుతున్నాయి. రైతులు నష్టపోకుండా లాభాల బాటలో నడుస్తున్నారు. ప్రభుత్వం కూడా ప్రోత్సాహకాలు అందిస్తుండడంతో మరింత ఉత్సాహం అనిపిస్తోంది.

'శాతవాహన' సమాచారం

డిగ్రీ పరీక్షల్లో పది మంది డీబార్

గణేశ్‌నగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షల్లో శనివారం పది మంది విద్యార్థులు డీబార్ అయినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో సెమిస్టర్‌లో అపూర్వ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు, వాణినికేతన్ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఇద్దరు, శ్రీచైతన్య ఉమెన్స్ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో నలుగురు, ప్రభుత్వం డిగ్రీ కళాశాల గోదావరిఖనిలో ఒకరు, మూడో సెమిస్టర్‌లో వివేకానంద డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు, శ్రీచైతన్య ఉమెన్స్ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు డీబార్ అయినట్లు తెలిపారు.

పీజీ, ఎంసీఏ, ఎంబీఏ మూడో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించనున్న పీజీ, ఎంబీఏ, ఎంసీఏ మూడో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్ వి శ్రీరంగ ప్రసాద్ శనివారం విడుదల చేశారు. ఈ పరీక్షలు జనవరి రెండో తేదీ నుంచి 21వ తేదీ వరకు జరగనున్నట్లు తెలిపారు. పరీక్ష సమయం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుందని వివరించారు.

టీజీవో సంఘం ప్రచార కార్యదర్శిగా సంతోష్


సంతోష్‌ను అభినందిస్తున్న నాయకులు

జగిత్యాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ అధికారుల(టీజీవో) సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా జగిత్యాల జిల్లాకు చెందిన గంగుల సంతోష్ ఎంపికయ్యారు. శనివారం హైద్రాబాద్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గంలో ప్రచార కార్యదర్శిగా గంగుల సంతోష్ కుమార్‌ను నియమిస్తూ టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా సంతోష్‌కుమార్ నియమితులైన సందర్భంగా టీజీఓ జిల్లా అధ్యక్షుడు కందుకూరి రవి బాబు, కార్యదర్శి మామిడి రమేశ్, నాయకులు కాళీచరణ్, రవీందర్, దేవానంద్ హర్షం వ్యక్తం చేశారు.

మెడికల్ ఆఫీసర్ నియామకానికి నోటిఫికేషన్

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్ నియామకానికి నోటిఫికేషన్ జారీ చేశారు. ఎంబీబీఎస్ విద్యార్హతతో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ ఫీల్డ్‌లో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత నివ్వనున్నట్టు సూపరింటెండెంట్ దయాల్ సింగ్ పేర్కొన్నారు. 70 సంవత్సరాలలోపు వయసు ఉండాలన్నారు. నెలకు రూ.72వేల వేతనం ఉంటుందని, రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తామన్నారు. అర్హత కలిగిన వారు ఈనెల 27వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఏఆర్‌టీ సెంటర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎడారి దారిలో.. వేములకుర్తి



ఐదు దశాబ్దాల క్రితం ఆ గ్రామం గల్ఫ్ బాట పట్టింది. తండ్రి మొదలుకొని ఇప్పుడున్న కొడుకులు, యువత అదే బాటలో పయనించి ఆర్థికంగా ఎదిగారు. గల్ఫ్ వలసలకు కేరాఫ్‌గా వేములకుర్తి నిలుస్తోంది. గ్రామంలో ఐదు వేలు పై చిలుకు జనాభా ఉండగా దాదాపుగా 800 మంది గల్ఫ్‌లోనే స్థిరపడ్డారు. విదేశీ వలసల వల్ల గ్రామానికి యేటా సుమారు రూ. 15 కోట్ల విదేశీ మారకద్రవ్యం వస్తోంది. వలసల కారణంగా గ్రామంలో అధికంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులే కని పిస్తుంటారు. స్వయం ఉపాధి పొందుతున్న యువకులు, ఉద్యోగస్థులు, వ్యవసాయం జోరుగా చేస్తున్న వ్యక్తులు మాత్రమే ఇక్కడ ఉంటున్నారు. మిగిలిన వారంతా దాదాపుగా విదేశాల్లోనే ఉపాధి చూసుకుని అక్కడే ఉంటున్నారు.

- ఐదు దశాబ్దాలుగా గల్ఫ్ బాటలో
- విదేశాల్లో కంపెనీలు స్థాపించి అక్కడే స్థిర జీవనం
- గ్రామానికి యేటా సుమారు రూ. 15కోట్ల విదేశీ మారకద్రవ్యం

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): జగిత్యాల-నిర్మల్ జిల్లాల మధ్య గల గోదావరి తీర ప్రాంతమైన ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామం విదేశీ వలసలకు నిలయంగా మారింది. సుమారు ఐదు దశాబ్దాలుగా గ్రామానికి చెందిన యువత విదేశాలకు వెళ్లి వస్తున్నారు. ఉన్న ఊర్లో ఉపాధి అంతంతమాత్రంగానే ఉండడంతో యువత ఎడారి బాట పడుతున్నారు. గ్రామంలో దాదాపుగా ఇంటికి ఒకరు చొప్పున గల్ఫ్ దేశాల్లో ఉపాధి చూసుకుని అక్కడే ఉంటున్నారు. గల్ఫ్ దేశాలతో వేములకుర్తి వాసులకు ఎక్కువగా రాకపోకల సంబంధాలు ఉంటున్నాయి. ప్రధానంగా మస్కట్, అబుదాబి, బెహరన్, ఓమన్, దుబాయి, ఖతార్ తదితర దేశాలకు వలస వెళ్లి వివిధ రంగాల్లో పనిచేస్తున్నారు.

సొంత కంపెనీల ఏర్పాటు....

వేములకుర్తి నుంచి గల్ఫ్ దేశాలకు ఉపాధి నిమిత్తం వెళ్లిన పలువురు గ్రామస్థులు అక్కడ సొంత కంపెనీలు ఏర్పాటు చేసుకొని ఇతరులకు సైతం పనికల్పించే స్థితికి ఎదిగారు. కొందరు సొంత వ్యాపారాలు నిర్వహిస్తుండగా, మరికొందరు పలు సాఫ్ట్‌వేర్, కన్ స్ట్రక్షన్ కంపెనీలను నెలకొల్పి ఇతరులకు ఉపాధి చూపుతున్నారు. వేములకుర్తికి చెందిన సుమారు పది కుటుంబాలు గల్ఫ్‌లో కంపెనీలు నెలకొల్పి స్థిరపడ్డాయి. పలువురు యు వకులు వివిధ కంపెనీల్లో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ట్రావెలింగ్ ఏజంట్, లేబర్, స్టీల్ ఫిట్టర్, ట్రేడర్స్, స్టోర్ కీపర్‌గా, పెట్రోలు బాయ్‌గా, మున్సిపల్ వర్కర్‌గా, సినిమాహాళ్ల, హోట ళ్లలో పనిచేస్తున్నారు. వేములకుర్తికి చెందిన ప్రవాస భారతీయుల సహకారాలతో గ్రా మంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరిగాయి.

గల్ఫ్‌లో 800 మంది....

వేములకుర్తి గ్రామం నుంచి ప్రస్తుతం సుమారు 800 మంది వరకు గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్నారు. కొందరు ప్రొఫెషనల్ పనులు చేస్తుండగా, మరికొందరు కార్మికులుగా ప నిచేస్తున్నారు. అర్హత, అనుభవం, అవకాశాలను బట్టి గల్ఫ్ దేశాల్లో వివిధ రంగాల్లో వేములకుర్తి వాసులు ఉన్నారు. అక్కడ సంపాదించిన సొమ్మును ఖర్చులు పోను పలు సందర్భాల్లో సొంత గ్రామంలోని తమ కుటుంబ సభ్యులకు, బంధువులకు పంపుతుం టుంటారు. ఒక్కొక్కరు నెలకు భారత కరెన్సీ విలువ ప్రకారం సుమారు రూ. 25 వేల నుంచి రూ. 1.50 లక్షల వరకు సంపాదిస్తున్నారు. దీంతో నెలకు సగటున సుమారు రూ. కోటిన్నర వరకు కోట్ల విదేశీ మారకద్రవ్యం వస్తోంది. యేటా సుమారు రూ. 15 కోట్ల వ రకు ఉంటుందన్న అంచనాలున్నాయి. గ్రామంలో అధిక లావాదేవిలు జరుగడంతో విరి సౌకర్యార్థం ఓ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ను గ్రామంలో ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నారు.


వేములకుర్తి గ్రామ స్వాగత తోరణం


సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు జలాభిషేకం చేస్తున్న గల్ఫ్ మిత్రులు

వ్యవసాయంపై ఆధారపడి జీవించేవాళ్లం

-అల్లకొండ గంగాధర్, వేములకుర్తి



నేను 1986 సంవత్సరంలో దుబాయి వెళ్లాను. అప్పుడు మా గ్రామం నుంచి కొత్తగా దుబాయి వెళ్లాం. దుబాయి వెళ్లి బిల్డింగ్ పనులు చేసి ఉపాధి పొందాము. నెలకు అక్కడ ఇండియా కరెన్సీ ప్రకారం 14 వేల జీతం తీసుకునేవాడిని. అక్కడ కొన్ని ఖర్చులకు ఉంచుకుని మిగిలిన డబ్బులను ఇంటికి పంపేవాళ్లం. నేను అంతకు ముందు ఊళ్లో వ్యవసాయం, గీత కార్మికుడికి కళ్లు అమ్ముకుంటూ ఉపాధి పొందేవాడిని. సొంత ఊళ్లో పని చేసినప్పుడు పొట్ట, బట్ట మందం మాత్రమే సంపాదించే వాడిని. గల్ఫ్ వెళ్లిన తర్వాతనే ఆర్థికంగా ఎదిగాను. 1986 కంటే ముందు గ్రామంలో అందరు వ్యవసాయం, వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటు కాలం గడిపేవాళ్లం. కానీ గ్రామం నుంచి ఒక్కొక్కరుగా గల్ఫ్ బాట పట్టడంతో గ్రామస్థులందరూ ఆర్థికంగా ఎదిగారు. అప్పుడు చిన్న చిన్న పెంకుటిళ్లు ఉండేవి. ఇపుడు ప్రతీ ఒక్కరు పెద్ద పెద్ద భవంతులు సొతూళ్లలో నిర్మించుకున్నారు. విలాసవంతమైన జీవితనం గడుపుతున్నారు. గ్రామంలో ఒక్కప్పుడు బిజినెస్‌లు అనేవి లేకుండే. ఇప్పుడు పదుల సంఖ్యలో కోళ్ల ఫాంలు ఏర్పాటు చేసుకున్నారు. ఆర్థిక లావాదేవీలు జరగడంతో బ్యాంక్‌లు ఏర్పడ్డాయి. పెద్ద పెద్ద వావానాలు కొనుగోలు చేసి వేరే రాష్ట్రాలలో బిజినెస్‌లు చేస్తున్నారు.

ఉపాధి నిమిత్తం ఎడారి బాట పట్టాం

- ఆడ్వల రాము, వేములకుర్తి



ఉన్న ఊర్లో ఆశించిన ఉపాధి దొరకక పోవడం వల్ల ఏడారి బాట పట్టాం. సింగపూర్ దేశంలో ఓ కంపెనీలో అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్‌గా పని చేశాను. 1.5 లక్షల రూపాయలు జీతం తీసుకున్నాను. ప్రస్తుతం గ్రామం తిరిగి వచ్చి సొంతంగా కోళ్ల ఫారం పెట్టుకున్నాను.

పాతికేళ్లుగా గల్ఫ్‌లో ట్రావెలింగ్ ఏజెన్సీ నిర్వహిస్తున్నా..

- చింత రాజమల్లు, వేములకుర్తి



సుమారు గత పాతికేళ్లగా వేములకుర్తిలో ట్రావెలింగ్ ఏజెన్సీతో పాటు ఓ చిన్న కంపెనీ నెలకొల్పాను. అప్పుడప్పుడు వేములకుర్తికి వచ్చి వెళ్తుంటాను. గ్రామం నుంచి గల్ఫ్ దేశాల్లో అధిక సంఖ్యలో యువత పనిచేస్తున్నారు. స్థానికంగా ఉపాధి లేకపోవడం కారణంగా వలసలు జరుగుతున్నాయి.

యోగాతో మానసిక వికాసం

- యోగా అసోసియేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక వికాసం కలుగుతుందని తెలంగాణ యోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. జిల్లా క్రీడాశాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలో శనివారం నిర్వహించిన సీఎం కప్ జిల్లాస్థాయి యోగా, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ప్రశంసాపత్రాలను, పతకాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు యోగాలో శిక్షణ పొందితే సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారన్నారు. రాష్ట్రంలోనే కరీంనగర్ యోగా క్రీడాకారులు తిరుగులేని పతకాలను సాధిస్తూ జాతీయ స్థాయిలో విజయాలను పొందుతున్నారన్నారు. జిల్లా యువజన క్రీడాశాఖాధికారి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ జిల్లాలోని క్రీడా సంఘాలు, వ్యాయామ ఉపాధ్యాయుల సహకారంతో సీఎంకప్ జిల్లాస్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించామన్నారు. ఉదయం యోగా, వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలను డీవైఎస్‌వో అధికారులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో తెలంగాణ యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, వెయిట్ లిఫ్టింగ్ జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాబు శ్రీనివాస్‌గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు అంతడ్పుల శ్రీనివాస్, సొల్లు సారయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు అంతటి శంకరయ్య, పోతన శ్రీనివాస్, వంగపల్లి సూర్యప్రకాశ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు పతకాలను అందజేస్తున్న రవీందర్‌సింగ్


యోగాసనాలు వేస్తున్న బాలికలు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


విద్యార్థినిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

కోనరావుపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని పూజిత రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడలకు ఎంపికైనట్లు ఎంఈవో మురళి నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన పూజిత ఈనెల 22 నుంచి 25 వరకు మేడ్చల్ మల్కాజిగిరిలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడలకు ఎంపికైందని వివరించారు. కాగా పలువురు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు విద్యార్థిని శనివారం అభినందించారు.

రాజన్నను దర్శించుకున్న డైరెక్టర్ వంశీ పైడిపల్లి


డైరెక్టర్ వంశీకి రాజన్న ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని ప్రముఖ సినీ డైరెక్టర్ వంశీ పైడిపల్లి శనివారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి చేరుకున్న వంశీ పైడిపల్లికి బీఆర్ఎస్ సీనియర్ నేత, వేములవాడ సింగిల్ విండో చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి స్వాగ తం పలికారు. రాజన్న ఆలయంలోకి చేరుకున్న వంశీ కోడెమొక్కు చెల్లించుకు ని పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. అనంతరం రాజన్న ఆలయ అర్చకులు ఆశీర్వదించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. ఏనుగు తిరుపతిరెడ్డి రాజన్న చిత్రపటాన్ని అందజేశారు.

అంజన్న సన్నిధిలో..

మల్యాల: సినిమా దర్శకుడు వంశీ పైడిపల్లి శనివారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో కుటుంబసభ్యులతో కలిసి స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌రెడ్డితో పాటు కొడిమ్యాల సింగిల్‌విండో చైర్మన్ రాజనర్సింగరావు, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్, రాజు ఉన్నారు.

మహిళలకు 'భరోసా'

- బాధితుల్లో ఆత్మవిశ్వాసం నింపడమే లక్ష్యం
- కొత్తపల్లిలో నేడు కేంద్రాన్ని ప్రారంభించనున్న డీజీపీ
- రూ.1.70 కోట్లతో ఆధునిక వసతులతో నిర్మాణం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యల పరిష్కారం చూపుతూ, వారికి భద్రత కల్పించేందుకు కరీంనగర్ శివారులోని కొత్తపల్లిలో పోలీసుశాఖ భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. కమిసనరేట్‌లోని పోలీసు ఠాణాల్లో నమోదైన మహిళలు, బాలికలకు సంబంధించిన కేసుల్లో బాధితుల వాంగ్మూలం రికార్డు చేయటం, కోర్టులో హాజరుపరచటం, మెజిస్ట్రేట్‌తో వాంగ్మూలనం రికార్డు చేయించటం, కౌన్సెలింగ్ వంటివి ఈ భరోసా కేంద్రంలో జరుగనున్నాయి. ఆదివారం డీజీపీ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్) జితేంద్ర కొత్తపల్లిలో నూతనంగా నిర్మించిన భరోసా కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. కమిషనరేట్ కేంద్రంలో నిర్మించిన ఫంక్షన్‌హాల్, కేఫ్‌లను ఆయన ప్రారంభోత్సవం చేయనున్నారు. 2022 డిసెంబరు 17న ఈ భరోసా కేంద్రానికి శంకుస్థాపన జరగగా కోటి 70 లక్షల రూపాయల నిధులతో 13 గుంటల స్థలంలో అత్యంత ఆధునిక వసతులతో ఈ భవనం నిర్మాణం పూర్తి చేశారు. ఈకేంద్రంలో చైల్డ్ అండ్ ఉమెన్ ప్రొటెక్షన్, అత్యాచారం, పోక్సో కేసుల విచారణ జరుపుతారు. గృహహింస, పోక్సో, సైబర్ వేధింపుల్లో మహిళా బాధితులకు సరైన న్యాయ సహాయం అందించాలనే ధ్యేయంతో ఈ భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురైన, ఆపదలో ఉన్న మహిళలకు వైద్య చికిత్సలు, కౌన్సెలింగ్, భద్రత, న్యాయసహాయాన్ని అందించేందుకు ప్రత్యేకంగా జిల్లాకు ఒకటి భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో పనిచేసేందుకు కాంటాక్ట్ ఉద్యోగుల నియామకానికి దరఖాస్తులు కోరుతూ పోలీస్ కమిషనర్ ఇటీవల నోటిఫికేషన్ కూడా జారీ చేశారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో నడిచే ఈ భరోసా కేంద్రానికి ఏసీపీ మాధవి ఇన్‌చార్జిగా ఉన్నారు. ప్రస్తుతం ఈ భరోసా కేంద్రంలో ఒక నిర్వహణాధికారి, ఇద్దరు కౌన్సెలర్లు, రిసెప్షనిస్టు, ఒక ఏఎన్ఎం, లీగల్ అడ్వైజర్ ఉంటారు. వీరంతా బాధితులకు కావాల్సిన అన్ని రకాల సమాచారంతో పాటు సహాయాన్ని అందిస్తారు.




కొత్తపల్లిలో ప్రారంభానికి సిద్ధమైన భరోసా కేంద్రం

కమిషనరేట్‌లో మహిళలపై నేరాలు పెరుగుతున్నాయి. ఏడాదిలో 500పైగా మహిళలకు సంబంధించిన కేసులు నమోదవుతున్నాయి. ఇందులో అత్యాచారాలు, వేధింపులు, పోక్సో కేసులకు సంబంధించిన బాధితుల్లో మహిళలు, యువతులు, బాలికలు ఉన్నారు. పోలీసు కమిషనరేట్ పరిధిలో మహిళలపై జరుగుతున్న వివిధ రకాల నేరాల కట్టడి, కేసుల నమోదు, కౌన్సెలింగ్ ఇవ్వటం, బాధితులకు న్యాయ సహాయం అందించడం, ఎన్ఆర్ఐ భర్తల కేసుల్లో సహాయం అందించడం, మహిళలను వేధించే పోకిరీలకు చెక్‌పెట్టడం, సైబర్ నేరాలపై మహిళలకు భరోసా కేంద్రం ద్వారా అవగాహన కల్పిస్తారు. మహిళా బాధితుల్లో ఆత్మవిశ్వాసం నింపడం, లైంగిక, ఇతర రకమైన వేధింపులు, నేర ఘటనల్లో ఎవరికి ఫిర్యాదు చేయాలి, ఎవరిని సంప్రదించాలి తదితర విషయాల్లో ఈ భరోసా కేంద్రం ద్వారా అవగాహన కల్పించనున్నారు.

కమిషనరేట్‌లో కన్వెన్షన్ సెంటర్‌ను ప్రారంభించనున్న డీజీపీ

కమిషనరేట్ కేంద్రంలో దశాబ్దాల కిందట నిర్మించిన జాన్‌విల్సన్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను ప్రస్తుతం పోలీస్ కమిషనర్ ప్రత్యేక చొరవ తీసుకుని కన్వెన్షన్ సెంటర్‌గా పునర్నిర్మాణం చేయించారు. దీన్ని డీజీపీ ప్రారంభించనున్నారు. దీనిలో పోలీసు కుటుంబాలలో పెళ్లిళ్లకు కొంత రాయితీ ఇస్తూ ఇతరులకు కూడా ఇందులో శుభకార్యాలు నిర్వహించుకునేందుకు అవకాశం ఇవ్వనున్నట్లు సమాచారం. చాకలి ఐలమ్మ జంక్షన్‌లోని పెరేడ్ గ్రౌండ్‌లో రోడ్డువైపున ఒక కేఫ్‌ను ఏర్పాటు చేశారు. ఈ రెండు కూడా డీజీపీ ప్రారంభించనున్నారు.

'కేథడ్రల్‌రాక్' పై 108 సూర్య నమస్కారాలు


పర్వతంపై సూర్య నమస్కారాలు చేస్తున్న ప్రవీణ్

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్, 21 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని వెల్లుల్ల గ్రామానికి చెందిన మరిపెల్లి ప్రవీణ్ అమెరికాలోని అరిజోనా రాష్ట్రం సెడోనా సమీపంలోని కేథడ్రల్ రాక్ పర్వతాన్ని అధిరోహించాడు. ప్రవీణ్ ఈనెల 20న సముద్ర మట్టానికి 4900 అడుగుల ఎత్తులోని రాతి పర్వతాన్ని అధిరోహించి 22 నిమిషాలలో 108 సూర్య నమస్కారాలు చేసినట్లు ఆయన తెలిపాడు. ప్రవీణ్ ఇప్పటికి అతి తక్కువ ఉష్ణోగ్రతలలోని ఎత్తయిన 49 పర్వతాలు అధిరోహించాడు. వాటిపై 108 సూర్య నమస్కారాలు చేస్తూ యోగా శక్తిని ప్రపంచానికి చాటిచెబుతున్నాడు.

హోరాహోరీగా ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

- విజేతలుగా రాజన్న సిరిసిల్ల , కరీంనగర్ జిల్లా జట్లు

సిరిసిల్ల టౌన్/కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్-2024 ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. రాజన్న సిరిసిల్ల పురుషుల జట్టు, కరీంనగర్ మహిళ జట్టు విజయం సాధించాయి. శనివారం జిల్లా యువజన, కీడాశాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణం మినీస్టేడియంలో సీఎం కప్-2024 ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నీ నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లా పురుషుల నాలుగు జట్లు, మహిళ నాలుగు జట్లు పాల్గొన్నాయి. పురుషుల విభాగంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రథమ స్థానంలో, జగిత్యాల జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. మహిళల విభాగంలో కరీంనగర్ జిల్లా జట్టు ప్రథమ స్థానంలో, రాజన్న సిరిసిల్ల జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేత జట్లకు ట్రోఫీలతో పాటు వ్యక్తిగతంగా స్వర్ణం, సిల్వర్ మెడల్స్‌ను జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి అజ్మీరా రాందాస్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గిన్నె లక్ష్మణ్, రాజన్న సిరిసిల్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చింతకింది శ్యాంకుమార్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్ర శ్రీనివాస్‌రెడ్డి అందించి క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో జగిత్యాల వాలీబాల్ అసోషియేషన్ అధ్యక్షుడు సుధీర్‌రావు, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ గుడ్ల రవి, కోశాధికారి కోడం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, వాలీబాల్ అకాడమి కోచ్‌లు సంపత్, జగన్, వ్యాయామ ఉపాధ్యాయులు, వాలీబాల్ జట్ల కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.




విజయం సాధించిన కరీంనగర్ జిల్లా మహిళల జట్టుతో అతిథులు, తలపడుతున్న వాలీబాల్ జట్లు

న్యూస్ బాక్స్

ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా కిరణ్ కుమార్

సిరిసిల్ల క్రైమ్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా కిరణకుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. సిరిసిల్ల సబ్ రిజిస్ట్రార్‌గా సెలవులో వెళ్లడంతో జగిత్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే కిరణ్ కుమార్ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా నియమిస్తూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు.

రేపు మెగా హెల్త్ క్యాంపు

గంభీరావుపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం లింగన్నపేటతండాలో సోమవారం మెగా హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు స్థానిక ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. నిష్ణాతులైన వైద్య నిపుణులతో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, రోగ నిర్ధారణ అనంతరం మందులు అందజేయనున్నట్లు వెల్లడించారు.

నిందితుడి అరెస్టు

తంగళ్లపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇందిరానగర్‌కు చెందిన పిట్టల మహేష్ అనే నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. తంగళ్లపల్లిలో ఇంటి తాళాలు పగుల గొట్టి ఇంట్లో ఇనుప సామాను దొంగలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. శనివారం తంగళ్లపల్లికి చెందిన పెరుమాండ్ల లలిత, క్యారం జగన్‌కుమార్ ఇళ్ల తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న ఇనుప పైపులు, ఇనుపచువ్వలు, ప్లాస్టిక్ డబ్బాలు దొంగలించి ఆటోలో తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అమిత్ షా వ్యాఖ్యలే నిదర్శనం

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలే బీజేపీ భారత రాజ్యాంగాన్ని మారుస్తుందనడానికి నిదర్శనమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ఆరోపించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శనివారం మాట్లాడారు. చట్ట సవరణలు చేసే పార్లమెంటులో అంబేద్కర్‌పై వ్యాఖ్యలు చేయడంపై మండిపడ్డారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఒకరి రిమాండ్

సిరిసిల్ల క్రైం డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని సర్దాపూర్ శివారులో అసైన్డ్ భూములను అప్పటి రెవెన్యూ అధికారుల సహకారంతో రెవెన్యూ రికార్డులలో ఎక్కించుకున్న వొజ్జెల అగ్గి రాములును రిమాండ్‌కు తరలించామని సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ద్వారా వచ్చే లబ్ధి పొందుతూ మోసం చేస్తున్నాడని అగ్గి రాములుపైనా, అతడితో కుమ్మక్కైనా అధికారులపైనా సిరిసిల్ల తహసీల్దార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

సమస్యల వ్యథ



(5వ పేజీ తరువాయి)

ఇప్పల్లపల్లెలో అద్దెభవనాల్లో నిర్వహిస్తున్న వసతి గృహాలు

చన్నీటి స్నానాలు

తంగళ్లపల్లి: మండలంలోని నేరెళ్ల బాలికల గురుకుల పాఠశాల, పద్మనగర్ కస్తూర్బా బాలికల పాఠశాలలో వేడినీరు సరిపోక చాలా మంది విద్యార్థులు చన్నీటి స్నానాలు చేస్తున్నారు. బద్దనపల్లి బాలికల గురుకుల పాఠశాల, ఇందిరమ్మ కాలనీలో తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో వేడినీటి సౌకర్యం లేదు. డార్మెంటరీ లేక తరగతి గదిలోనే కాలం వెళ్ల దీస్తున్నారు. విద్యార్థులకు సరిపడా స్నానాల గదులు, మరుగుదొడ్లు లేవు. తంగళ్లపల్లి మండల కేంద్రంలో గిరిజన మహిళా డిగ్రీ కళాశాల, బాలికల మైనార్టీ పాఠశాల అద్దె భవనంలో ఇరుకైన గదులతో ఇబ్బందులు పడుతున్నారు.

వేములవాడ రూరల్ : మండలంలోని మర్రిపల్లి కస్తూర్బాలో స్నానాలకు సరిపడా వేడినీళ్లు లేవు.

స్టడీ చైర్స్ లేక అవస్థలు

ముస్తాబాద్: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల నూతన వసతి గృహం ఉన్నా విద్యార్థులకు సరిపోక తరగతి గదిలోనే డార్మెంటరీ ఉపయోగించుకుంటున్నారు. సరిపడా కుర్చీలు లేక నేలపై విద్య నభ్యసిస్తున్నారు. పది, తొమ్మిదో తరగతి విద్యార్థులు సొంతంగా స్టడీ చైర్స్‌ను తెచ్చుకున్నారు. కిటికీలకు దోమ తెరలు లేవు. విద్యార్థులందరికీ వేడి నీటి సౌకర్యం లేదు. రూ.కోటి వ్యయంతో పాఠశాల ఎదుట మైదానంలో వసతి గృహాన్ని నిర్మిస్తున్నారు.

49 మందికి రెండు స్నానపు గదులు

చందుర్తి: చందుర్తి మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో 49 మంది విద్యార్థులకు రెండు స్నానాల గదులు, రెండు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. మండల కేంద్రంలోని కేజీబీవీలో డ్రైనేజీ దుర్గంధం వెదజల్లుతోందని విద్యార్థులు పేర్కొన్నారు.

పని చేయని ఫ్యాన్లు

రుద్రంగి: మండల కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ బాలుర వసతి గృహాల్లోని గదుల్లో ఫ్యాన్లు పని చేయడం లేదు. సరిపడా వేడినీరు అందడం లేదు. చన్నీటి స్నానాలు చేస్తున్నారు. కిటికీలకు దోమతెరలు లేవు. హాస్టల్ ఆవరణలో భారీగా చెట్లు పెరిగాయి. విద్యుద్దీపాలు లేక చీకటిగా ఉంది. దుప్పట్లు అందలేదు.

నేలపై నిద్ర ...

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలంలోని మహాత్మా బాపూలే, ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులు చన్నీటి స్నానాలు చేస్తున్నారు. మండలకేంద్రంతోపాటు కేజీబీవీలో తరగతి గదుల్లో నేలపై నిద్రిస్తున్నారు. మహాత్మా జ్యోతిబాపూలే జూనియర్, డిగ్రీ కళాశాల అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. పెద్దూర్‌కు కేటాయించిన జూనియర్ కళాశాలను ఎల్లారెడ్డిపేటలో నిర్వహిస్తున్నారు. వసతులు లేక తరగతి గదుల్లోనే సామగ్రితో నిద్రిస్తున్నారు. దుప్పట్లు తెచ్చుకున్నారు. కిటికీలకు తలుపులు దోమతెరలు లేవు. డైనింగ్ హాల్ లేక ఆవరణలో కూర్చొని తింటున్నారు. చన్నీళ్లతో స్నానం చేస్తున్నారు. సరిపడా మరుగుదొడ్లు, స్నానాల గదులు లేవు. అల్మాస్ పూర్ కేజీబీవీలో సరిపడా బాత్రూంలు లేక వేకువ జాము నుంచే వరుస కడుతున్నారు. బెడ్స్ లేక నేలపై తరగతి గదులు, డైనింగ్ హాల్లో నిద్రపోతున్నారు. దుమాల ఏకలవ్య ఆదర్శ పాఠశాలలో చన్నీళ్లతో స్నానం చేస్తున్నారు.

కూరగాయలు వండడం లేదు

వీర్నపల్లి: మండలంలో కేజీబీవీలో కూరగాయలు వండడం లేదు. పప్పు చారుతో కాలం వెల్లదీస్తున్నారు. భోజనంలో నాణ్యత లేదని విద్యార్థులు తెలిపారు. బెడ్లు లేక నేలమీద నిద్రిస్తున్నారు. దుప్పట్లు లేవు. మరుగుదొడ్లు సరిపడా లేవు. చన్నీళ్ల స్నానాలే చేస్తున్నారు. ఆదర్శ పాఠశాలలో కిటికీలు, వెంటిలేటర్లు లేక కోతులు, దోమలు వస్తున్నాయి.

అద్దె భవనాల్లో సమస్యలు

సిరిసిల్ల రూరల్: పెద్దూర్ శివారులో ఇప్పల్లపల్లి వద్ద మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల అద్దెభవనంలో కొనసాగుతోంది. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మరుగుదొడ్ల నీరు రోడ్డుపై పారుతోంది. విద్యార్థులు పడుకునే గదులకు గోడలు లేకపోవడంతో చలిలోనే నిద్రిస్తున్నారు. చన్నీటి సాన్నాలు చేస్తున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాలలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో రెండు నెలల నుంచి సోలార్ హీటర్‌లు పనిచేయడం లేదు. పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద బీసీ వసతి గృహం అద్దెభవనంలో కొనసాగుతోంది. కనీస సౌకర్యాలు లేవు. పట్టణంలోని సుందరయ్యనగర్ బాలుర ఎస్సీ హాస్టల్‌లో గీజర్ సరిపోవడం లేదు. దుప్పట్లను ఇంటి నుంచి తెచ్చుకున్నారు. బాలికల వసతి గృహంలో గీజర్లు సరిపోక వేడి నిటికి ఇబ్బందులు పడుతున్నారు. వసతి గృహాల్లో కామన్ మెనూ అమలు కావడం లేదని విద్యార్థులు తెలిపారు.

ఇతరులు లోనికి రావద్దు



వేములవాడ జ్యోతిబాఫూలే బాలుర వసతి గృహానికి తాళం వేసి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

వేములవాడ టౌన్: ఇతరులు లోనికి రావద్దని ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి తాళాలు వేసిన సంఘటన వేములవాడ మున్సిపల్ పరిధిలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర వసతి గృహంలో చోటు చేసుకుంది. ఆంధ్రజ్యోతి విజిట్‌లో భాగంగా వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ వెనుకబడిన బాలుర కళాశాల వసతి గృహాన్ని సందర్శించింది. వసతి గృహం ఆవరణలోని పిచ్చి మొక్కలు అన్ని ఎక్స్‌కావేటర్‌తో తొలగించారు. వసతి గృహాల్లో సమస్యలు లేవు. విద్యార్థులు నిద్రించే గదుల్లో వెంటిలేటర్లు లేకపోవడంతో చలి ఎక్కువ ఉంటున్నట్లు చెబుతున్నారు.

చందుర్తి మండలం లింగంపేట మహాత్మా జ్యోతిబాపూలే బాలుర సంక్షేమ గురుకుల వసతి గృహం ఎదుట ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. సమస్యలు లేవని ఫోన్ ద్వారా ప్రిన్సిపాల్ రాజయ్య తెలిపారు.

వేములవాడ అయ్యప్ప ఆలయం సమీపంలోని తెలంగాణ మైనార్టీ బాలుర రెసిడెన్షియల్‌లోకి అనుమతి లేదని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.



రుద్రంగిలో విద్యుద్దీపాలు లేకపోవడంతో చీకటిగా ఉన్న గ్రౌండ్



ముస్తాబాద్‌లో డైనింగ్ హాల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల్లో ఫుడ్ ఫెస్టివల్

వీర్నపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలం గర్జనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల సమావేశంలో భాగంగా తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఫుడ్ ఫెస్టివల్‌లో భాగంగా విద్యార్థులు తయారు చేసిన వంటకాలను ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, అభివృద్ధి కమిటీ చైర్మన్ రాకేష్ గౌడ్ పాల్గొన్నారు.

చందుర్తి : చందుర్తి మండలం ఎనగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వయంగా తయారు చేసిన పోషక విలువలతో కూడిన ఫుడ్ ఐటమ్స్‌ను ప్రదర్శించారు. అనంతరం గణిత దినోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని సునీతారాణి, గుర్రం కృష్ణా రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ దర్ర గోదావరి, సలహాదారులు గడ్డం దేవయ్య, కుసుంబ మధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలం మల్కపేట ప్రభుత్వ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో గీత, భారతి, శ్యామ్, మహేందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు తయారు చేసిన ఆహార పదార్థాలు

సిరిసిల్లను ఉరిసిల్లగా మారుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నేతన్నలకు ఉపాధి కల్పించ కుండా కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్లను ఉరిసిల్లగా మారుస్తోందని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేతన్నలకు ఉపాధిని కల్పించకపోవడంతో అర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నేతన్నలకు నిరంతరం ఉపాధిని కల్పించాలని, ఆత్మహత్యలను నివారించాలని కోరారు. ఉపాధిలేక కార్మికులు అత్మహత్యలు చేసుకుంటే చేనేత జౌళిశాఖ అధికారులు తప్పుడుగా చిత్రీకరించి ప్రకటిస్తున్నారని మండిపడ్డారు. 2023 సంవత్సరానికి రావాల్సిన యారన్ సబ్సిడీ విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అన్నల్‌దాస్ గణేష్, వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్లె సత్యం, వైపని కార్మిక సంఘం అధ్యక్షుడు కుమ్మరికుంట కిషన్, డీవైఎఫ్ఐ నాయకులు రమేష్‌చంద్ర, ఒగ్గు గణేష్, మచ్చవేణు, బూట్ల వెంకటేశం, బెజుగం సురేష్, స్వర్గం శేఖర్, ఎక్కల్‌దేవి జగదీష్, సబ్బని చంద్రకాంత్, బింగి సతీష్, బల్ల రామచంద్రం, ఎనుగుల రమేష్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

ముస్తాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్‌లోని బాలుర, బాలికల పాఠశాలలతోపాటు చీకోడ్‌లోని ప్రభుత్వ పాఠశాల పదోతరగతి విద్యార్థులకు గౌడ అఫిషియల్ అండ్ ప్రొఫెనల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్టడీ మెటీరియల్ అందజేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎల్లమ్మల లక్ష్మణ్‌గౌడ్, ముత్తయ్యగౌడ్, నాగుల శ్రీనివాస్, పర్శరాం, నిమ్మ రాజిరెడ్డి, అంబటి దేవేందర్ పాల్గొన్నారు.

అన్యమత ప్రచారంపై ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళన

ముస్తాబాద్, డిసెంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు పాఠశాలలో అన్యమత ప్రచారం చేస్తున్నారని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేని రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. శనివారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాల గేట్ ఎదుటకు చేరుకొని ఎంఈవో, డీఈవోకు సమాచారం అందించారు. స్థానిక ఎంఈవో రాజిరెడ్డి అక్కడి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. అనంతరం రంజిత్ కుమార్ మాట్లాడుతూ పాఠశాలలో మత ప్రచారాలకు అడ్డాగా మారిందని ఆరోపించారు. అనుమతులు లేకుండా హాస్టల్ నడుపుతున్నారని, ఫైర్ సర్టిఫికెట్ లేకుండా అసంపూర్తిగా ఉన్న భవనంలో పాఠశాల నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. స్థానిక ఎంఈవో పాటు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అన్ని పండుగల్లా పాఠశాలలో క్రిస్మస్ సంబరాలు నిర్వహించామని ఎఠశాల సిబ్బంది పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మెర్గు అంజాగౌడ్, హిందు సంఘాల నాయకులు మద్దికుంట రమేశ్, బొల్లం కిశోర్, బండారి రాజేశ్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న రంజిత్‌కుమార్

బాధిత కుటుంబానికి పరామర్శ

రుద్రంగి, డిసెంబరు, 21(ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ కంటెరెడ్డి తండ్రి కంటె రాములు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో వేములవాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నర్సింహరావు శనివారం వారి కుటుంబాన్ని పరామర్శించారు.

ఆయన వెంట సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దెగవాత్ తిరుపతి, గ్రామ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్, గంగం మహేష్, మాడిశెట్టి ఆనందం, చేప్యాల గణేష్, దయ్యాల పెద్దులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఘనంగా గణిత దినోత్సవం

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు ప్రాథమిక పాఠశాలల్లో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయా పాఠశాలల్లోని విద్యార్థులు 1729 ఆకారంలో కూర్చొని వేడుకలను నిర్వహించడంతో పాటు విద్యార్థులకు రామానుజన్ గణితానికి చేసిన సేవలను వాటి ప్రాముఖ్యాన్ని ప్రధానోపాధ్యాయులు నాగుల భాగ్యరేఖ, కే గణేష్ వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాసాల హరిప్రసాద్, నందిని, సౌమ్య, కరుణ చందన, గన్నమనేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ గణిత శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రామానుజన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గణిత ఉపాధ్యాయులను సన్మానించారు. గొల్లపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు 1729 ఆకృతితో కూర్చున్నారు. పాఠశాలలో తెలంగాణ ఆహారోత్సవాన్ని జరిపారు. విద్యార్థులు రకరకాల వంటకాలను తయారు చేశారు. అనంతరం విద్యార్థులకు గణితంలో క్విజ్, గణిత మేళాలను నిర్వహించారు. ఎంఈవో కృష్ణహరి, పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సిరిసిల్ల నెహ్రూనగర్ హైస్కూల్‌లో 1729 ఆకృతిలో కూర్చున్న విద్యార్థులు

ఇల్లంతకుంట: మండలంలోని కందికట్కూర్, పెద్దలింగాపూర్, అనంతగిరి, గాలిపెల్లిలోని ప్రభుత్వ పాఠశాలలతోపాటు వాణీనికేతన్, వివేకానంద పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన గణిత ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. వాణీనికేతన్ హైస్కూల్‌లో 1729 ఆకృతిలో విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్‌గౌడ్, ప్రధానోపాధ్యాయులు తిరుపతి, పావని, మహమ్మద్ గౌస్, తూముకుంట శ్రీనిధి పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని శ్రీసరస్వతీ శుభోదయం ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులు గణిత ఫార్ములాలు సంబంధించి ప్రాజెక్టు వర్క్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాం డెంట్ శ్రీనివాస్‌యాదవ్, ప్రిన్సిపాల్ మాధవి లతారెడ్డి, ప్రీప్రైమరీ ఇన్చార్జి పద్మశ్రీ, సందీప్, గిరిజ, సౌజన్య, వాణి, రమ్య, వనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చందుర్తి: మండలంలోని నర్సింగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు గణితానికి సంబంధించిన ఉపన్యాస, వ్యాస రచన క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జితేందర్, ఉపాధ్యాయులు జాకీర్, బన్నాజీ, శ్రీనివాస్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణ రిజర్వాయర్ ఆయకట్టుకు నీటి విడుదల

ఇల్లంతకుంట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్ ద్వారా ఆయకట్టుకు అధికారులు శనివారం 30 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. నీటి విడుదలతో బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాల రైతులకు ప్రయోజనం చేకూరనుంది.నీటి విడుదల చేయాలని మాజీ ఎంపీపీ వెంకటరమణారెడ్డి మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకరావడంతో ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో డీఈ దేవేందర్, ఏఈ విజయ్‌లతో పాటు రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో నేత కార్మికుడి ఆత్మహత్య



నక్క శ్రీనివాస్(ఫైల్)

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బద్దం ఎల్లారెడ్డినగర్‌కు చెందిన నక్క శ్రీనివాస్ (43) అనే నేత కార్మికుడు ఆర్థిక ఇబ్బందులతో శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సిరిసిల్ల పట్టణానికి చెందిన శ్రీనివాస్ రెండేళ్ల క్రితం వరకు పవర్ లూం కార్మికుడిగా పని చేశాడు. ఆ తర్వాత పాన్‌షాప్ పెట్టుకొని జీవనం సాగించాడు. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదంలో చేయి విరిగింది. దీంతో పనులు చేయడానికి వీలు లేకుండా పోవడంతో ఏడాదిగా ఇంటి వద్ద ఉంటున్నాడు. ఎక్కడైనా పని చేద్దామని వెళ్తే ఎవరూ పని ఇవ్వడం లేదు. మరోవైపు ఆసుపత్రిలో చికిత్స, ఇతర అవసరాలకు మూడు లక్షల రూపాయల వరకు అప్పులయ్యాయి. కుటుంబ పోషణకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీంతో మనస్తాపం చెందిన శ్రీనివాస్ శనివారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో ఆసుపత్రికి తరలించేందుకు యత్నించగా ఆలోపే మృతిచెందాడు. శ్రీనివాస్‌కు భార్య, ఇద్దరు కూతుళ్ల ఉన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం

ఇల్లంతకుంట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందివ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రధానోపాధ్యాయిని ప్రేమలత పేర్కొన్నారు. ఇల్లంతకుంట, దాచారం, అనంతగిరి గ్రామాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఆహారోత్సవం కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు తయారు చేసిన వంటకాలను తల్లిదండ్రులకు రుచిచూపించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మహమ్మద్‌గౌస్‌తో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

వేములవాడ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ధ్యానంతో మానసిక ప్రశాంతంగా లభిస్తుందని వేములవాడ న్యూ అర్బన్ కాలనీ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం విక్కుర్తి లక్ష్మీనారాయణ అన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులతో కలిసి ధ్యానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచానికి యోగ అందించిన ఘనత భారతదేశానిదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, బుడంగారి విజయ పాల్గొన్నారు.

అనంతారం ప్రాజెక్టులోకి నీటిని విడుదల చేయాలి

ఇల్లంతకుంట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అన్నపూర్ణ రిజర్వాయర్ ద్వారా అనంతారం ప్రాజెక్టులోకి నీటిని విడుదల చేయాలని బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ కోకన్వీనర్ బత్తిని స్వామిగౌడ్ ఒక ప్రకటనలో కోరారు. గత సంవత్సరం నీటి విడుదల చేయకపోవడంతోనే అనేక గ్రామాలలో పంటలు ఎండిపోయాయని పేర్కొన్నారు. అనంతారం ప్రాజెక్టులోకి నీరు వస్తే బిక్కవాగు, రహీంఖాన్‌పేట గ్రామంలోని సింగరాయ చెరువు ఆయకట్టుదారులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. అన్నపూర్ణ రిజర్వాయర్‌లో నీరు ఉన్నందున ప్రభుత్వం వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయడం లేదు

ఇల్లంతకుంట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కల్యాణలక్ష్మి పథకం చెక్కులను పంపిణీ చేయడం లేదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వస్తే లక్ష రూపాయలతోపాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. మూడు నెలలుగా కల్యాణలక్ష్మి చెక్కులు రాక తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వెంటనే చెక్కులను పంపిణీ చేయాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం.. ముగ్గురిపై కేసు

ఎల్లారెడ్డిపేట డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజన్నపేటలో ఇంటి స్థలం విషయంలో నెలకొన్న గొడవతో మనస్తాపం చెందిన గడ్డం పద్మ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఆమెను ఇబ్బందుల గురి చేసిన అదే గ్రామంలోని రెడ్డిమల్ల సత్యనారాయణ, అతడి తండ్రి ప్రకాష్, తల్లి సత్తవ్వపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన పద్మ తన కొడుకు సాయికుమార్‌తో కలిసి నివసిస్తోంది. శిథిలావస్థకు చేరుకున్న ఇల్లు వర్షానికి కూలిపోవడంతో ఆ స్థలంలో గ్రామపంచాయతీ అనుమతి మేరకు నిర్మాణం చేపట్టింది. ఆ స్థలం తమకు చెందుతుందని సత్యనారాయణ ఇబ్బందులకు గురిచేశాడు. దీంతో పద్మ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా అనుకూలంగా తీర్పు వచ్చింది. ఇంటి నిర్మాణ పనులు చేస్తున్న క్రమంలో సత్యనారాయణతోపాటు ఆయన తండ్రి ప్రకాష్, తల్లి సత్తవ్వ వచ్చి అసభ్య పదజాలంతో దూషించారు. మనస్తాపం చెందిన పద్మ పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబసభ్యులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి కొడుకు సాయికుమార్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

మధ్యాహ్న భోజనం అమలు చేయాలి

చందుర్తి, డిసెంబరు 21: (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ డిమాండ్ చేశారు. చందుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ స్కాలర్ షిప్‌లను విడుదల చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో కళాశాల నూతన కమిటీ ఎన్నుకున్నారు అధ్యక్షుడిగా నిఖిల్, కార్యదర్శిగా పి.అభిషేక్, ఉపాధ్యక్షులుగా శ్రీనిత్, నిఖిల్, ఇర్ఫాన్, సహాయ కార్యదర్శిగా అఖిల్, మణిదీపక్ పరమేష్, గణేశ్, బాలికల కన్వీనర్‌గా వైష్ణవికో కన్వీనర్‌గా శృతిక, జాయింట్ కన్వీనర్‌గా గ్రీష్మ, భార్గవి పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు కుల బహిష్కరణ పంచాయితీ

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో కొర్రి రమేశ్‌ను కులం నుంచి వెలేశారంటూ పెద్దలపై పోలీసులు కేసు నమోదు చేయడంతో పంచాయితీ శనివారం పోలీస్ స్టేషన్‌కు చేరింది. ఓ సామాజిక వర్గానికి చెందిన సుమారు 200 మంది సభ్యులు పోలీస్ స్టేషన్ ఎదుట నిరసనకు దిగారు. తాము ఎవరినీ కులం నుంచి బహిష్కరించలేదని పేర్కొన్నారు. తన కుటుంబాన్ని కులం నుంచి బహిష్కరించారని రమేశ్ ఈ నెల 20న ఆత్మహత్యకు యత్నించిన వీడియో వైరల్ కావడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కులం పెద్దలపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ఆ సంఘం సభ్యులంతా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. రమేశ్ పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని తమపై అక్రమ కేసు పెట్టించారని ఆరోపించారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించాలని, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు.

మహాసభలను విజయవంతం చేయాలి

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర 6వ విద్య, వైజ్ఞానిక రాష్ట్ర మహాసభలను విజయవతం చేయాలని అఖిలభారత తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జూకంటి జగన్నాథం, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోల్కొండ శ్రీధర్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని కుసుమరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్య, వైజ్ఞానిక రాష్ట్ర మహాసభల పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈ నెల 28, 29, 30, తేదీల్లో మహాసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా అధ్యక్షుడు పరకాల రవీందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి జంగిటి రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాకాల శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షులు గున్నమనేని మహేందర్‌రావు, అంబటి రమేష్, ఆడెపు శివకుమార్, పాముల స్వామి పాల్గొన్నారు.